క్లుప్తంగా

భూ పంపిణీకి 1,600 దరఖాస్తులు

కూడేరు: అసైన్డ్ కమిటీ ద్వారా నిబంధనల మేరకు అర్హులకు 5 ఎకరాల వరకూ భూ పంపిణీ చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతుందని తహసీల్దార్ మధుసూదన్ తెలిపారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో భూ పంపిణీకి వచ్చిన దరఖాస్తుల పరిశీలన, నివేదిక తయారీపై సిబ్బందితో సమీక్షించారు. 2 ఎకరాల భూమి ఉండి కూడా ప్రభుత్వ భూమిలో 3 ఎకరాల వరకూ సాగులో ఉన్నా పంపిణీ చేస్తామన్నారు. మూడేళ్ల నుంచి సాగులో ఉన్న వారు అర్హులవుతారన్నారు. మండల వ్యాప్తంగా భూ పంపిణీకి 1,600 దరఖాస్తులు వచ్చాయన్నారు. ప్రస్తుతానికి 70 మంది పేర్లను వెరిఫికేషన్ కోసం కలెక్టరేట్‌కు పంపినట్లు వెల్లడించారు.

ఐచర్‌ను ఢీకొట్టిన కారు

ఉరవకొండ: స్థానిక కోనాపురం గ్రామ సమీపంలో సోమవారం 42వ జాతీయ రహదారిపై ఉరవకొండ నుంచి అనంతపురానికి వెళుతున్న ఓ కారు.. టమాట లోడ్‌తో బళ్లారి నుంచి అనంతపురానికి వెళ్తున్న ఐచర్ వాహనాన్ని వెనుక వైపు నుంచి ఢీకొట్టింది. ఈ ఘటనలో కారు ముందు భాగం నుజ్జునుజ్జయింది. ప్రమాదంలో ఎవ్వరికీ ఎలాంటి గాయాలు కాలేదు. అయితే టమాట బాక్సులు రోడ్డుపై పడటంతో నేలపాలయ్యాయి.

శెట్టూరు తహసీల్దార్‌గా ఫణికుమార్



శెట్టూరు: మండల తహసీల్దార్‌గా ఈ.ఫణికుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందిస్తానన్నారు. నూతనంగా బాధ్యతలు తీసుకున్న తహసీల్దార్‌కు డిప్యూటీ తహసీల్దార్ మహేశ్వర రెడ్డి, వీఆర్‌ఓలు పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు.

వైఎస్సార్ బీమా తక్షణ సాయం అందజేత

బొమ్మనహాళ్: మండల కేంద్రంలోని వినాయకనగర్‌లో నివాసం ఉంటున్న అక్కిశెట్టి తిరుమలేసు (36) ఆదివారం అనారోగ్యంతో మృతి చెందాడు. మృతుడి కుటుంబానికి వైఎస్సార్ బీమా పథకం కింద రూ.10 వేల తక్షణసాయాన్ని సోమవారం అధికారులు అందజేశారు. మిగిలిన మొత్తం నామినీ ఖాతాలో జమ అవుతుందన్నారు. కార్యక్రమంలో మండల అగ్రిబోర్డు చైర్మన్ శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ సచివాలయ కన్వీనర్ కరుణాకర్, పంచాయతీ సెక్రటరీ సుబాంజీరావు, వెల్ఫేర్ అసిస్టెంట్ దేవేంద్ర, ఎఫ్ఏ మహేష్ పాల్గొన్నారు.

అసత్య ఆరోపణలు చేస్తే ఊరుకోం



మాట్లాడుతున్న సర్పంచ్ చంద్రశేఖర్ యాదవ్, వైఎస్సార్‌సీపీ నాయకులు

కంబదూరు: ఇదేం ఖర్మ కార్యక్రమం ద్వారా గ్రామాల్లో తిరుగుతూ.. మంత్రి ఉషశ్రీచరణ్‌పై లేనిపోని అసత్య ఆరోపణలు చేస్తే ఊరుకునేది లేదని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఉమామహేశ్వర్ నాయుడిపై కురాకులపల్లి సర్పంచ్ చంద్రశేఖర్ యాదవ్, వైఎస్సార్‌సీపీ నాయకులు ధ్వజమెత్తారు. సోమవారం వారు కురాకులపల్లిలో విలేకరులతో మాట్లాడారు. గతంలో మీరు అధికారంలో ఉన్నప్పుడు ప్రజలకు ఏమి చేయలేదు.. ఇప్పుడు ఏ ముఖం పెట్టుకుని తిరుగుతున్నారని ప్రశ్నించారు. ప్రజలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను పారదర్శకంగా అందిస్తుంటే.. ఆ పథకాలను పేదలకు అందకుండా అడ్డుకోవడం దుర్మార్గమన్నారు. టీడీపీ నాయకులు ఎన్ని గిమ్మిక్కులు చేసినా నమ్మే స్థితిలో ప్రజలు లేరన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీని నామరూపలు లేకుండా చేసేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఇప్పటికైనా నా పద్ధతి మార్చుకోవాలని టీడీపీ నాయకులకు హితవు పలికారు. కార్యక్రమంలో ఎంపీటీసీ నాగరాజు, నాయకులు నాగేంద్ర, అక్కులన్న, రామాంజినేయులు, వన్నప్ప, ప్రభాకర్ పాల్గొన్నారు.

ఘనంగా ఇమాంషావలి ఉరుసు



ప్రార్థనల్లో పాల్గొన్న విప్ కాపు

కణేకల్లు: మండలంలోని మాల్యం గ్రామంలో కులమతాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా జరుపుకునే ఇమాంషావలి ఉరుసు సోమవారం రాత్రి ఘనంగా జరిగింది. రాష్ట్ర ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి దర్గాను సందర్శించి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అంతకుముందు దర్గా ధర్మకర్త ఫక్రుద్దీన్, వెల్డింగ్ ఆదాం, అనంతపురం యూనస్, మాబుపీరా తదతరులు విప్ కాపును సాదరంగా ఆహ్వానించి శాలువా కప్పి పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో కణేకల్లు పట్టణ వైఎస్సార్‌సీపీ కన్వీనర్ కేశవరెడ్డి, కార్యదర్శి ఆదిసద్గురు చంద్రశేఖర్ రెడ్డి హంపన్నగౌడ్ పాల్గొన్నారు.

ప్రజా సంకల్పయాత్ర చరిత్రాత్మకం

- సీఎం జగన్ చేపట్టిన ప్రజా సంకల్పయాత్రకు నాలుగేళ్లు
- సంబరాలు చేసుకున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు



కణేకల్లు: వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి

కణేకల్లు: వైఎస్సార్‌సీపీ అధినేత జగన్ ప్రజల మేలును కోరుతూ చేపట్టిన 'ప్రజా సంకల్పయాత్ర' ఓ చరిత్రాత్మకమైన ఘట్టమని రాష్ట్ర ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. ప్రజా సంకల్పయాత్ర చేపట్టి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా సోమవారం వైఎస్సార్‌సీపీ శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. తొలుత రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రభుత్వ విప్ కాపు మాట్లాడుతూ.. జగన్ అన్ని వర్గాల ప్రజల కష్టసుఖాలను తెలుసుకునేందుకు ప్రజా సంకల్పయాత్ర' చేపట్టి 3,648 కిలోమీటర్ల పాదయాత్ర చేశారన్నారు. ప్రజల కోసం జగన్ చేపట్టిన పాదయాత్రలో తాము కూడా అడుగులో అడుగేసి ముందుకు సాగడం ఎంతో గర్వంగా ఉందన్నారు. ఓ వైపు టీడీపీ ప్రభుత్వ వైఫల్యాల్ని ఎండగడుతూ మరో వైపు ప్రతి ఒక్కరిని కలుసుకుని బాగోగులను తెలుసుకున్నారన్నారు. అన్నీ వర్గాల సంక్షేమం కోసం 'నవరత్నాలు' ప్రవేశపెడతానని మాటిచ్చి ఎన్నికల మేనిఫెస్టోలో ఇదే అజెండాగా రూపొందించి చరిత్రలో కనివిని ఎరగని రీతిలో 175 స్థానాలకు గాను 151 స్థానాలను గెలవడం జరిగిందన్నారు. రాబోవు రోజుల్లో 175/175 స్థానాలను గెలువాలనే లక్ష్యంతో సీఎం జగన్ అడుగులు ముందుకేస్తున్నారన్నారు. కార్యక్రమంలో కణేకల్లు పట్టణ వైఎస్సార్‌సీపీ కన్వీనర్ టీ.కేశవరెడ్డి, హౌసింగ్ కార్పొరేషన్ బోర్డు డైరెక్టర్ ఇల్లూరు శ్రీనివాసులు, జిల్లా వక్ఫ్ బోర్డు సభ్యులు పెద్దదేవర మాబుపీరా, ఎంపీటీసీ వన్నూరుసా, వెంకట్రామిరెడ్డి, డాక్టర్ సోమన్న, చంద్రశేఖర్‌రెడ్డి, ప్రకాష్‌చౌదరి, పైనేటి తిమ్మప్ప చౌదరి, చిన్న సర్మస్ కెనిగుంట రామిరెడ్డి, శ్రీనివాసరెడ్డి, వేమన, రామ్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

అన్ని వర్గాల సంక్షేమమే జగన్ ధ్యేయం..

రాయదుర్గంటౌన్: సుదీర్ఘ పాదయాత్రతో అన్ని వర్గాల ప్రజల కష్టాలు తెలుసుకుని, అధికారంలోకి రాగానే మేనిఫెస్టోలోని ప్రతి హామీని అమలు చేస్తూ రాష్ట్రంలో జన రంజక పాలన అందజేస్తున్న ఏకైక నేత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రరెడ్డి పేర్కొన్నారు. అప్పట్లో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చేపట్టిన ప్రజా సంకల్ప పాదయాత్రకు నాలుగేళ్లు పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకుని సోమవారం పట్టణంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహం వద్ద ఉన్న వైఎస్సార్ విగ్రహానికి పూలమాలతో నివాళులర్పించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మల్లికార్జున, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మాధవరెడ్డి, పట్టణ కన్వీనర్ ముస్తాక్, మున్సిపల్ వైస్ చైర్మన్లు శ్రీనివాసయాదవ్, వలిబాషా, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ శ్రీనివాసులు, కౌన్సిలర్లు శ్రీలక్ష్మి, గౌని లావణ్య, మమత, పెద్ద వన్నూరుస్వామి, గోవిందరాజులు, షబ్బీర్, దేవరాజు, డిష్ గోవిందు, శ్రీనివాసరెడ్డి, మంజునాథ, కోఆప్షన్ సభ్యుడు శ్రీనివాసులు, నజీర్, వార్డు ఇన్‌చార్జ్‌లు పొరాళ్ల శివకుమార్, సునార్ ఇస్మాయిల్, శ్రీరామిరెడ్డి, బషీర్ అహ్మద్, వైజాగ్ రిబ్కా, వైజాగ్ రవి పాల్గొన్నారు.

వజ్రకరూరు: ఇచ్చిన మాటకు కట్టుబడి ఎన్నికల్లో ఇచ్చిన ప్రతిహామీని అమలు చేసిన ఏకైక నాయకుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అని వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. వైఎస్ జగన్ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు చేపట్టిన ప్రజా సంకల్పయాత్ర పూర్తి చేసి నాలుగు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా సోమవారం వైఎస్సార్‌సీపీ నాయకులు సంబరాలు చేసుకున్నారు. స్థానిక బస్టాండ్‌లో ఉన్న వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ రమావత్‌దేవి, పార్టీ యువజన విభాగం అధ్యక్షుడు సురేష్, ఉపాధ్యక్షుడు ఉస్మాన్,సర్పంచ్ సురేంద్ర, గ్రామ కమిటీ అధ్యక్షుడు బాబు, డైరెక్టర్ రాచన్నగౌడ్, బూత్‌స్థాయి అధ్యక్షుడు ఓబులేసు, మైనార్టీ మండల కార్యదర్శి హబీబ్, బీసీ సెల్ కార్యదర్శి వీరభద్రగౌడ్, ఎస్టీ సెల్ కార్యదర్శి సామానాయక్, ఎంపీటీసీ రామకృష్ణ పాల్గొన్నారు.

బొమ్మనహాళ్: మూడున్నర సంవత్సరాల్లో మేనిఫెస్టోలోని 98 శాతం హామీలను సీఎం జగన్ నెరవేర్చారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఈశ్వర్‌రెడ్డి, ఎంపీపీ చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని ఉద్దేహాళ్ గ్రామంలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు వైఎస్ జగన్ పాదయాత్రను చేసి నేటికి నాలుగేళ్లు పూర్తయిందన్నారు. 14 సంవత్సరాలు సీఎంగా ఉన్న చంద్రబాబు ఒరగబెట్టింది ఏమీ లేదన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కోటేశ్వరరెడ్డి, వన్నూరుస్వామి, ఎంపీటీసీ యువరాజు స్వామి తదితరులు పాల్గొన్నారు.



రాయదుర్గంటౌన్: కేక్ కట్ చేసి సంబరాలు చేసుకుంటున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



వజ్రకరూరు: వైఎస్సార్ విగ్రహం వద్ద సంబరాలు..

గుమ్మఘట్ట: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని జెడ్పీటీసీ సభ్యుడు పీఎస్ మహేష్ సూచించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాదయాత్ర చేసి నాలుగేళ్లు పూర్తి కావడంతో సోమవారం వైఎస్సార్‌సీపీ నాయకులు సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ మంజునాథ, సర్పంచ్‌లు ఉమేష్, రాజేష్, వైఎస్సార్‌సీపీ ఎస్సీసెల్ రాష్ట్ర కార్యదర్శి బీటీపీ గోవిందు,రైతు ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు నాగిరెడ్డి, నాయకులు మాజీ సర్పంచ్ చిత్రశేఖరప్ప, ఖాజాహుస్సేన్, సుధాకర్‌రెడ్డి, బేలోడు రామాంజినేయులు, రంగస్వామి, రామప్ప, గుమ్మఘట్ట రాజు, జయరామిరెడ్డి, వన్నూరుస్వామి పాల్గొన్నారు.

డి హీరేహాళ్ (రాయదుర్గం): ప్రజా సంకల్పయాత్రతో సీఎం జగన్ ఏపీ రాజకీయాల్లో చరిత్ర సృష్టించారని రాయదుర్గం మార్కెట్‌యార్డ్ చైర్మన్ భోజరాజ్‌నాయక్, పార్టీ మండల కన్వీనర్ వన్నూర్‌స్వామి పేర్కొన్నారు. పాదయాత్రకు నాలుగేళ్లు పూర్తి కావడంతో డి హీరేహాళ్ మండల కేంద్రంలోని సర్పంచులు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులతో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

జగనన్న స్మార్ట్ టౌన్‌షిప్‌లో తక్కువ ధరకే ప్లాట్లు

కూడేరు: జగనన్న స్మార్ట్ టౌన్ షిప్‌లో మధ్య తరగతి ఆదాయ వర్గాల (ఎంఐజీ) వారికి తక్కువ ధరలకు ఇంటి స్థలాలు ఇవ్వడం జరుగుతుందని అహుడా ప్లానింగ్ సెక్రెటరీలు అఫీజ్, విష్ణు అన్నారు. సోమవారం వారు కూడేరు పొలం సర్వే నంబర్ 535లో 28 ఎకరాల్లో అహుడా ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న జగనన్న స్మార్ట్ టౌన్ షిప్‌కు సంబంధించిన బ్రోచర్లను అందజేశారు. సెంటు రూ.2.10 లక్షలు ధర నిర్ణయించారన్నారు. ప్లాట్లు కావాల్సిన వారు అహుడా కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్లాట్లను లాటరీ పద్ధతిలో ఎంపిక చేస్తారని, ప్లాటుకు నిర్ణయించిన ధరలో తొలుత 10 శాతం చెల్లించాలన్నారు. తర్వాత 30 శాతం చొప్పున కంతుల పద్ధతిలో నగదు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు.

రక్షణ కల్పించండి

- పోలీసులను ఆశ్రయించిన ప్రేమజంట

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం విద్యారణ్యనగర్‌కు చెందిన సాకే హర్షవర్ధన్, శెట్టూరు మండలం యాటకల్లు గ్రామానికి బి.మహేశ్వరి కొంతకాలంగా ప్రేమించుకున్నారు. ఇద్దరూ ఇళ్ల నుంచి వెళ్లిపోయి ఈనెల 7న తిరుపతి శ్రీనివాస మంగాపురం ఆలయంలో వివాహం చేసుకున్నారు. సోమవారం గ్రీవెన్స్‌లో ఎస్పీ ఫక్కీరప్పను కలిసి తమకు రక్షణ కల్పించాలని కోరారు. ఎస్పీ ఆదేశాల మేరకు దిశ పోలీసులు ప్రేమికుల తల్లిదండ్రులను పిలిపించారు. ఇద్దరూ మేజర్లు కావడంతో వారి ఇష్టం మేరకే నడుచుకోవాలని పోలీసులు సూచించారు. అనంతరం ప్రేమికులిద్దరినీ మండల మెజిస్ట్రేట్, తహశీల్దార్ శ్రీధరమూర్తి ఎదుట హాజరుపరిచారు. వాంగ్మూలం తీసుకుని మహేశ్వరిని భర్త హర్షవర్ధన్ ఇంటికి పంపారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

కూడేరు: మండల పరిధిలోని అరవకూరు–కమ్మూరు గ్రామాల మధ్య ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కూడేరుకు చెందిన చెన్నకేశవ్ (20), మణికంఠ తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. చికిత్స నిమిత్తం అనంతపురంలోని సర్వజన ఆస్పత్రిలో అడ్మిట్ చేశారు. చెన్నకేశవ్ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మణికంఠ ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.

ఇంటింటికీ సంక్షేమం.. అదే మా ధ్యేయం



కణేకల్లు: పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి



కుందుర్పి: మహిళలకు పథకాలను వివరిస్తున్న మంత్రి ఉషశ్రీచరణ్

- 'గడప గడపకూ మన ప్రభుత్వం'లో మంత్రి ఉషశ్రీచరణ్, ప్రభుత్వ విప్ కాపు

కణేకల్లు: ఇంటింటికీ సంక్షేమ ఫలాలను అందించడమే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. కణేకల్లు గ్రామ సచివాలయం-3 పరిధిలోని రామనగర్ కొట్టాలలో సోమవారం 'గడప గడపకూ' మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. పథకాలన్నీ సక్రమంగా అందుతున్నాయా? లేదా? అని అడిగి తెలుసుకున్నారు. అమ్మఒడి, వైఎస్సార్ పింఛన్, ఆసరా, జగనన్న చేయూత, రైతుభరోసా తదితర పథకాలన్నీ జగనన్న సీఎం అయ్యాకే తమకు అందుతున్నాయని ఆయనకు అండగా నిలిచి రుణం తీర్చుకొంటామని లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు.

కాలవ ఇటు వైపు చూడలేదన్నా..

మంత్రిగా ఉన్న కాలవ శ్రీనివాసులు ఏ నాడూ మా కాలనీవైపు చూడలేదన్నా అంటూ రామనగర్ కొట్టాల కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రి హోదాలో కాలవ పలుమార్లు మీటింగ్‌కు వచ్చినప్పుడు రోడ్లు, డ్రైనేజీలు నిర్మించాలని విన్నవించినా ఫలితం లేకుండా పోయిందన్నారు. స్పందించిన విప్ కాపు.. ఈ ప్రాంతంలో ఎక్కడెక్కడ రోడ్లు, డ్రైనేజీలు అవసరమో గుర్తించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కణేకల్లు ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ప్రసాద్, జేఈ చెంచయ్యను ఆదేశించారు. పేదలకు ఇంటి స్థలంతో పాటు ఇళ్లు మంజూరు చేయాలని విప్ కాపు అధికారులకు ఆదేశించారు. వీరికి ఇచ్చేందుకు స్థలాలు లేకపోతే ఎల్‌పీసీ (ల్యాండ్ పర్చేజ్ స్కీమ్) ద్వారా స్థలం కొనైనా స్థలాలిచ్చేలా చర్యలు తీసుకొంటామన్నారు. కార్యక్రమంలో పట్టణ వైఎస్సార్‌సీపీ కన్వీనర్ టీ.కేశవరెడ్డి, డాక్టర్ సోమన్న, తహసీల్దార్ రజాక్‌వలీ, ఎంపీడీఓ శ్రీనివాసులు, ఈఓఆర్‌డీ గూడెన్న, సీనియర్ అసిస్టెంట్ గోవిందరెడ్డి, పీఏసీఎస్ అధ్యక్షుడు తిమ్మప్ప చౌదరి, ఎంపీటీసీ వన్నూరుషా, గోపులాపురం సర్పంచు ప్రకాష్‌చౌదరి, కో–ఆప్షన్ సభ్యుడు సర్మస్, వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రకాష్‌రెడ్డి, ఆదిసద్గురు చంద్రశేఖర్‌రెడ్డి, నాగరాజు, హనుమంతరావు, చిక్కణ్ణ, వన్నూరుస్వామి, రఘు, గౌని శ్రీనివాసరెడ్డి, రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మరోసారి జగన్‌ను సీఎంగా చేసుకుందాం..

కుందుర్పి: రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజల జీవన ప్రమాణాలు మెరుగు పర్చడమే ధ్యేయంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని స్త్రీశిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీచరణ్ అన్నారు. సోమవారం మండలంలోని కదరంపల్లి గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం చేపట్టారు.గ్రామంలో మంత్రి ప్రతి ఇంటివద్దకు వెళ్లి సంక్షేమ పథకాల అమలు తీరుపై లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. అధికారం చేపట్టిన మూడున్నరేళ్ల కాలంలో 98 శాతం హామీలు నెరవేర్చి, ప్రజల అభ్యున్నతికి తోడ్పాటు అందించారన్నారు. దేశంలో ఎక్కడా అమలు కాని విధంగా అభాగ్యులకు పింఛన్ సొమ్ము పెంచి, అందజేస్తున్నారని కొనియాడారు. దేశంలోనే ఆదర్శ సీఎంగా గుర్తింపు పొందారని కితాబిచ్చారు. రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలంటే జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేసేందుకు మనమందరం కంకణబద్ధులు కావాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ కమలమ్మ, పార్టీ మండల కన్వీనర్ సత్యనారాయణ శాస్త్రి, సింగిల్ విండో అధ్యక్షుడు వన్నూర్‌రెడ్డి, సర్పంచ్ జగన్, ఎంపీటీసీ సభ్యుడు ఈరన్న, ఆర్బీకే కృష్టారెడ్డి, సర్పంచులు అతావుల్లా, రామ్మూర్తి, హనుమంతరాయుడు, నాయకులు పోతిరెడ్డి, రోషన్‌సాబ్, అంజినరెడ్డి, వడ్డె అంజనేయులు, ధనుంజయ పాల్గొన్నారు.

త్యాగానికి ప్రతిరూపం అమ్మ



క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న విప్ కాపు రామచంద్రారెడ్డి, చిత్రంలో మెట్టు గోవిందరెడ్డి

రాయదుర్గం: సృష్టిలో తల్లిదండ్రుల పాత్ర వెలకట్టలేనిదని, కనిపించే దైవం, త్యాగానికి ప్రతిరూపం అమ్మ మాత్రమే అని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, ఏపీఐఐసీ చైర్మన్ మెట్టు గోవిందరెడ్డి అన్నారు. సోమవారం భక్త మార్కండేయస్వామి ఆలయంలో పద్మశాలీయులు రూపొందించిన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పద్మశాలీ సంఘం గౌరవ అధ్యక్షుడు, మాజీ మున్సిపల్ చైర్మన్ సోమమల్లెశప్ప, అధ్యక్షుడు రిటైర్డ్ ఉపాధ్యాయుడు శివప్ప అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో విప్ కాపు మాట్లాడారు. అమ్మ ప్రేమ స్వచ్ఛతకు మరో రూపమన్నారు. అమ్మను మించిన దైవం లేదన్నారు. అందరు ఉండి అనాథల్లా ఆశ్రమాల్లో చేర్పించే నీచ సంస్కృతి మానవ జాతికే అవమానకరమన్నారు. ప్రతి ఇంట్లోనూ పిల్లలకు వృద్ధ దాంపత్యంపై గౌరవ మర్యాదలు నేర్పేలా కృషి చేయాలన్నారు. పద్మశాలీ నూతన క్యాలెండర్‌లో ఈ గొప్పతనాన్ని చాటేలా పేజీలు ముద్రించడం సంతోష కరమన్నారు.

రూ.5 లక్షలు విరాళం అందజేసిన మెట్టు

ఏపీఐఐసీ చైర్మెన్ మెట్టు గోవిందరెడ్డి పద్మశాలీ కళ్యాణమండపం నిర్మాణానికి రూ.5 లక్షలను విరాళంగా అందించారు. గతేడాది విప్ కూడా విరాళం అందించారని, కులబాంధవులంతా ఇందులో భాగస్వాములు కావాలన్నారు. అప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందతని గుర్తు చేశారు. దేశంలోని పలు రాష్ట్రాల్లోనూ పద్మశాలి వంశస్తులు ఉన్నారని, వారి నడవడిక అన్నీ చోట్ల ఒకేలా ఉంటుందని గర్వపడ్డారు. భక్త మార్కండేయుడి ఆశీస్సులు అందరికి ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని మాట్లాడుతూ.. అమ్మ గురించి చెప్పాలంటే మాటలు సరిపోవన్నారు. సమాజంలో మనకు ఓ స్థానం కల్పించేది ఆ మాతృమూర్తి మాత్రమేనని తెలిపారు. అనంతరం కుల సంఘం నాయకులు, మహిళా నాయకురాళ్లతో కలసి నూతన క్యాలెండర్లను ఆవిష్కరించారు. విప్ కాపు, ఏపీఐఐసీ చైర్మెన్ మెట్టు, గౌని ఉపేంద్రారెడ్డిని సన్మానించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ వలిబాషా, పార్టీ సీనియర్ నాయకుడు పొరాళ్ల శివ, కాంట్రాక్టర్ రాజేంద్రరెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి వసుంధర, పట్టణ కౌన్సిలర్ల బృందం, వార్డు ఇన్‌చార్జులు, మాజీ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

వసతి గృహాల తనిఖీ

కళ్యాణదుర్గం: పట్టణంలోని బాలికల వసతి గృహాలు 1, 2, బాలురు వసతి గృహం-3, కాలేజ్ హాస్టల్‌ను ఆర్డీఓ నిశాంత్ రెడ్డి సోమవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు, వసతి గృహాల్లో సౌకర్యాలపై ఆరా తీశారు. బాలికల వసతి గృహంలో తాగునీటికి ఇబ్బందులున్నాయని విద్యార్థులు చెప్పడంతో ఆర్డీఓ వెంటనే స్పందించారు. సొంత నిధులతో బోరు వేసేందుకు హామీ ఇచ్చారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు చూడాలని సాంఘిక సంక్షేమ అధికారి నరసింహారావుకు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శంకరయ్య, ఆర్ఐ కృష్ణ, వార్డెన్లు జయలక్ష్మి, ఓబులమ్మ, ధనుంజయ,నాగరాజు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణించాలి

ఉరవకొండ రూరల్: విద్యార్థులు క్రీడల్లో రాణించి, కళాశాలకు పేరు తీసుకురావాలని చిన్నముష్టూరు వద్ద ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ కె.అష్రఫ్ అలీ అన్నారు. ఇటీవల అనంతపురంలో జరిగిన ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ మీట్ టెబుల్ టెన్నిస్ పోటీల్లో సత్తా చాటిన ఈఈఈ విద్యార్థి కె.వెంకటప్రసాద్‌ను సోమవారం అభినందించారు. ఫిబ్రవరిలో విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు కె.వెంకటప్రసాద్ ఎన్నిక కావడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఫిజికల్ డైరెక్టర్ వెంకటేష్‌నాయక్ సురేష్‌బాబు పాల్గొన్నారు.

హోరాహోరీగా ఆర్‌వైఎస్ఎల్ క్రికెట్ పోటీలు

రాయదుర్గంటౌన్: వైఎస్సార్‌సీపీ యువనేత కాపు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో జరుగుతున్న రాయదుర్గం యూత్ స్పోర్ట్స్ లీగ్ (ఆర్‌వైఎస్ఎల్) సంక్రాంతి క్రీడా పోటీల్లో భాగంగా క్రికెట్ మ్యాచ్‌లు హోరాహోరీగా సాగుతున్నాయి. సోమవారం జరిగిన పోటీల్లో గొల్లపల్లి జట్టుపై కాశీపురం జట్టు గెలుపొందింది. అలాగే గోవిందవాడ ఆర్‌డీటీ జట్టుపై గౌనికుంట విజయం సాధించగా సోమలాపురం జట్టుపై దగ్గాహొన్నూరు జట్టు విజయం సాధించింది. కాశీపురం జట్టులో రవి అనే క్రీడాకారుడు ఆరు వికెట్లు తీసి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించాడు. కార్యక్రమంలో ఆర్గనైజర్లు ఓబ, బషీర్, మురళి, నగేష్ అమరేష్ పాల్గొన్నారు.

భవనాల నిర్మాణానికి స్థలాలివ్వండి

గుమ్మఘట్ట: రైతుల ఉత్పత్తిదారుల సంఘం భవనానికి, నాలుగు శీతల గిడ్డంగులకు ప్రభుత్వం నిధులను మంజూరు చేయడంతో నూతన భవనాలకు ప్రభుత్వ స్థలాలు చూపాలని తహసీల్దార్ వేణుగోపాల్‌ను జెడ్పీటీసీ సభ్యుడు పీఎస్ మహేష్ కోరారు. మండల కేంద్రం, బీటీపీ ప్రాజెక్టులో ప్రభుత్వ స్థలాల హద్దుల గుర్తించి అందిస్తే భవన నిర్మాణ పనులను యుద్ధప్రాతిపదికన ప్రారంభిస్తామని తెలిపారు. తహసీల్దార్ సానుకూలంగా స్పందించి స్థలాలను చూపిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ నరేష్‌కుమార్, రైతు ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు నాగిరెడ్డి, పార్టీ మండల కన్వీనర్ మంజునాథ, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి బీటీపీ గోవిందు, రాజు, ఖాజాహుస్సేన్, గోవింద పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్–1938 క్యాలెండర్ ఆవిష్కరణ

బొమ్మనహాళ్: మండల కేంద్రంలోని ఎంఆర్‌సీ కార్యాలయం వద్ద సోమవారం ఏపీటీఎఫ్–1938 శాఖ నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఉన్నత పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్‌ఎం దిల్షాద్ బేగం, కేజీబీవీ ఎస్ఓ మంజుల తదితరులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షుడు మద్దిలేటప్ప మండల శాఖ ప్రధాన కార్యదర్శి వజీర్ బాషా, నాయకులు హనుమంతు నాయక్, చెన్న బసయ్య, ప్రసాద్, వెంకటసురేష్, ఎర్రిస్వామి, శైలజ, కిరణ్, పాల్గొన్నారు.

వైభవంగా ఉరుసు

వజ్రకరూరు: మండల పరిధిలోని కొనకొండ్ల, గూళ్యపాళ్యం గ్రామాల కొండమీద సోమవారం గురు హజరత్ సయ్యద్ మీరా మహమూద్ అష్రఫ్‌షా ఖాధరీస్వామి 161వ ఉరుసు అంగరంగ వైభవంగా జరిగింది. ఉదయం కొనకొండ్ల నుంచి కొండమీదకు పూలతో అలంకరించిన స్వామిని ఊరేగింపుగా తీసుకెళ్లారు. ప్రార్థనల అనంతరం స్వామికి చక్కెర చదివింపులు చేయించారు.

పారదర్శకంగా పింఛన్ల మంజూరు

బ్రహ్మసముద్రం: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కులమతాలు, రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ పారదర్శకంగా పింఛన్లు మంజూరు చేసిందని ఎంపీపీ కంభం చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని పిల్లలపల్లి సచివాలయంలో నూతనంగా మంజూరైన 11 మంది లబ్ధిదారులకు పింఛన్ సొమ్మును సర్పంచ్ తలారి గోవిందప్పతో కలిసి అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు హనుమంతరెడ్డి, వెంకటేశులు, పంచాయతీ కార్యదర్శి కవిత, వేల్ఫేర్ అసిస్టెంట్ సుధాకర్ పాల్గొన్నారు.

ఉద్యోగులకు భద్రత కల్పించాలి

విడపనకల్లు: విధులకు ఆటంకం కలిగిస్తున్న ఆకతాయిలపై చర్యలు తీసుకోవాలని గడేకల్లు సచివాలయ ఉద్యోగులు కోరారు. సోమవారం తహసీల్దార్ బ్రహ్మయ్యకు వినతిపత్రం అందించారు. ఎన్.తిమ్మాపురం గ్రామానికి చెందిన ఎర్రగారి రామాంజినేయులు, పశువుల నాగరాజు, పశువుల నగేష్ కొన్ని రోజులుగా సచివాలయానికి వచ్చి దురుసుగా ప్రవర్తిస్తున్నారని తెలిపారు. తమను అసభ్య పదజాలంతో దూషిస్తూ మాట్లాడమే కాకుండా విధులకు ఆటంకం కలిగిస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని సచివాలయ మహిళా ఉద్యోగులు మమత, సుగుణ, అరుణ, శిల్ప, మనీషా తదితరులు ఆవేదన వ్యక్తం చేశారు. హావళిగి, ఉండబండ, విడపనకల్లు, డొనేకల్లు, పంచాయతీ కార్యదర్శులు సురేష్, మునాఫ్, నాగరాజు, బాషా తదితరులు సచివాలయ ఉద్యోగులకు మద్దతు తెలిపారు.

తమలపాకు తోట దగ్ధం

గుమ్మఘట్ట: మండలంలోని బేలోడు గ్రామంలో సోమవారం రైతు కేశవరెడ్డికి చెందిన తమలపాకు తోట విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. సుమారు రూ.2 లక్షల వరకూ నష్టం వాటిల్లినట్లు రైతు తెలిపాడు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని, మంటలను ఆర్పేశారు.

కాలవ హయాంలోనే ఇసుక దోపిడీ



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

డి హీరేహాళ్ (రాయదుర్గం): టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు కాలవ శ్రీనివాసులు పలికే తాటాకు చప్పుళ్లకు భయపడేవారు ఎవరూ లేరని, ఆయన హయాంలోనే ఇసుక దోపిడి మాఫీయాలా సాగిందని మార్కెట్‌యార్డ్ చైర్మన్ భోజరాజ్‌నాయక్, మండల కన్వీనర్ వాల్మీకి వన్నూర్‌స్వామి ఆరోపించారు. సోమవారం ఎంపీపీ ఛాంబర్‌లో స్థానిక నాయకులతో కలసి వారు విలేకరులతో మాట్లాడారు. టీడీపీ హయాంలో జరిగిన అక్రమ ఇసుక రవాణాపై మంత్రి ఇలాకాలో కంత్రీలా కులాసా అంటూ ఓ పత్రికలో కథనాలు రావడం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. ఆనాడు ఏ స్థాయిలో దోపిడీకి పాల్పడ్డారో నేటికీ ఈ సాక్ష్యలే నిదర్శనమని గుర్తు చేశారు. నాడు–నేడు, సీసీ రోడ్లు, భవన నిర్మాణాలకు ఇసుక తరలిస్తే అక్రమమని ఎలా చెబుతారని నిలదీశారు. టీడీపీ హయాంలో ఇసుక దోపిడీ జరగలేని మురడి ఆంజనేయస్వామి ఆలయంలో ప్రమాణం చేసేందుకు వస్తావా? అంటూ సవాల్ విసిరారు. కొంత మంది నీతోక నాయకులు కూడా మాపై ఘటుగా విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. ఇకనైనా అనవసరపు ఆరోపణలు మానుకోకపోతే ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. విప్ కాపు రామచంద్రారెడ్డికి ఇసుకలో కూడబెట్టాల్సిన అవసరం లేదని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఓబుళాపురం సర్పంచ్ బోయ మల్లికార్జున, మైనార్టీ నాయకుడు రహంతుల్లా, సింగాడి జగదీష్ పాల్గొన్నారు.

పంచాయతీ అత్యవసర సమావేశం

ఉరవకొండ: గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో గుర్తించిన పనులపై చర్చించి వాటికి రూ.20 లక్షల నిధులు కేటాయించేందుకు సోమవారం పంచాయతీ కార్యాలయంలో అత్యవసర సమావేశం నిర్వహించారు. సర్పంచ్ లలితమ్మ అధ్యక్షతన జరిగిన సమావేశంలో వార్డు సభ్యులు అత్యవసరంగా గుర్తించిన పనులను సమావేశం దృష్టికి తెచ్చారు.